# రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలించాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

కామారెడ్డి, ఏప్రిల్ 4 : పట్టణ ప్రాంతంలో రేషన్ కార్డుల వెరిఫికేషన్‌ను వార్డు ఆఫీసర్లు పరిశీలించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతంలో ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని సూచించారు. మీ సేవా ద్వారా వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది పరిశీలన చేయాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో వార్డు ఆఫీసరులు పరిశీలించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్లు రాజేందర్ రెడ్డి, శ్రీహరి, మహేశ్ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



కామారెడ్డిలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి/మాచారెడ్డి/బీబీపేట్/రాజంపేట్/రామారెడ్డి/భిక్కనూరు, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పలువురికి సీఎంఆర్‌ఎఫ్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన 64 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, 36 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, కామారెడ్డి మండలానికి చెందిన 20 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లోని రైతువేదికలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో గోపీబాబు, ఎంపీవో నాగరాజు పాల్గొన్నారు. బీబీపేట, దోమకొండ మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. రాజంపేటలోని రైతువేదికలో సీఎంఆర్‌ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి పంపిణీ చేశారు. తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో రఘురాం, రాజంపేట మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు రాము, నాయకులు తదితరులు పాల్గొన్నారు. రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాలత, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఆర్ఐ రవికాంత్, గ్రామ పంచాయతీ కార్యదర్శి లింగాల సాగర్‌గౌడ్, బీజేపీ నాయకులు సాయిరాంగౌడ్, నరేశ్, ముత్యాల రాజు తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివ ప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పరి రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 4 : ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మహిళను టార్గెట్ చేసి, ఆమెతో కల్లు తాగి కత్తితో గొంతుపై దాడి చేసి హత్య చేసిన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ హాలులో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, హత్య కేసు వివరాలను వెల్లడించారు. నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాంగ్రా బోర్గాం గ్రామంలో కల్లు బట్టీ పక్కన ఓ ఇంట్లో చారుగొండ చంద్రకళ (55) ఒంటరిగా ఉండేది. కల్లు తాగేందుకు వచ్చిన కామారెడ్డి జిల్లా దళితవాడకు చెందిన యువకుడు శంషాబాద్ విజయ్.. చంద్రకళ ఒంటిపై ఉన్న నగలను కాజేసేందుకు ప్లాన్ వేశాడు. ఆమెతో పరిచయం ఏర్పర్చుకొని, గత నెల 23న సదరు యువకుడు కల్లు బట్టిలో కల్లు తీసుకుని చంద్రకళ ఇంట్లో ఆమెతో కలిసి తాగాడు. అనంతరం కత్తిలో ఆమె గొంతుపై దాడిచేశాడు. ఆమె మరణించిన అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు కమ్మలు, మాటిలతో పాటు వెండి పట్టగొలుసులు, సెల్‌ఫోన్ తీసుకొని పారిపోయాడు. పారిపోయేందుకు అదే ఏరియాలో ఓ ఇంటి ఎదుట నిలిపిఉంచిన బైక్‌ను సైతం దొంగిలించుకుపోయాడు. మృతురాలి కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టి, శంషాబాద్ విజయ్‌ని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి చోరీ చేసిన ఆభరణాలు, బైక్‌తోపాటు హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసును ఛేదించిన ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని సీపీ అభినందించారు.

## ఒకరికి జైలు శిక్ష, జరిమానా

కామారెడ్డి, ఏప్రిల్ 4 : అజాగ్రత్త, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఒకరి మరణానికి కారణమైన నిందితుడికి తొమ్మిది నెలల జైలు శిక్షతోపాటు రూ.1,500 జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేశ్‌చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూర్‌లో జమ్మగౌనిపోట్ల ముత్తా గౌడ్ కిరాయికి ఉంటున్న ఇంటి నుంచి తన ఇంటికి వెళ్తున్న సమయంలో బోయిని స్వామి ఆటోను అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ.. రోడ్డు దాటుతున్న ముత్తా గౌడ్‌ను ఢీకొట్టాడు. దీంతో తల, చేతులు, కాళ్లకు బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బోయిన స్వామిపై భిక్కనూర్ పోలీసు స్టేషన్‌లో మృతుని అన్న కుమారుడు జమ్మ గౌని పోట్ల శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు చేయగా ఎస్సై రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించారు. ఈ కేసులో సాక్షులను విచారించి సరైన సాక్షులను సేకరించి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ దీక్ష నిందితుడికి తొమ్మిది నెలల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధించినట్లు తెలిపారు. సరైన పద్ధతిలో విచారణ చేసిన అప్పటి భిక్కనూర్ ఎస్సై రాజు, పోలీసుల వాదనలు వినిపించిన పీపీ శివరాం నాయక్, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, కోర్టు లైజింగ్ ఆఫీసర్ ఎస్సై మురళి, కోర్టు కానిస్టేబుల్ రాజ శేఖర్ గౌడ్‌ను ఎస్పీ అభినందించారు.

## గ్రూప్-1 టాపర్‌కు సన్మానం

మాచారెడ్డి, ఏప్రిల్ 4 : మాచారెడ్డి మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన బూస ఉదయ్‌కిరణ్ ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 67వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఉదయ్‌కిరణ్‌ను శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందించారు. బీజేపీ మండలాధ్యక్షుడు బూస సురేశ్, నర్సింహులు, బాల్‌చంద్రం, హరిక, స్వామిగౌడ్, ప్రభాకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల పరిశీలన



సుల్తాన్‌పూర్ శివారులో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

బాన్సువాడ, ఏప్రిల్ 4 : ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట ఈదురు గాలులకు నేలకు ఒరిగింది. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. గురువారం వీచిన ఈదురు గాలులకు కోత దశకు వచ్చిన పంటలు నేలకు ఒరగడంతో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. పంటల పరిస్థితి, వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. మరో వారం రోజుల్లో కోత దశకు వచ్చిన పంటలు ఈదురుగాలులకు నేలకు ఒరగడంతోపాటు ధాన్యం గింజలు నేలరాలాయని, పంటలను పరిశీలించి వివరాలను కలెక్టర్‌కు వివరిస్తామని చెప్పారు. ఆయన వెంట బాన్సువాడ వ్యవసాయాధికారి ఫహీజుల్లా, వ్యవసాయ విస్తీర్ణాధికారిణి కావ్యశ్రీ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 4 : మండలంలోని చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. రెండు రోజులపాటు నూతనంగా ఎంపికైన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వారికి శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ హైదరాబాద్ వారి సూచనల మేరకు ప్రధానోపాధ్యాయులకు పాఠశాల నాయకత్వ లక్షణాలు, బోధన, అభ్యాసన నవకల్పనలు, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్, ఆదర్శ పాఠశాలలుగా మార్చడంలో ప్రధానోపాధ్యాయుల పాత్ర తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు, కోర్స్ డైరెక్టర్ సాయిరెడ్డి, రిసోర్స్ పర్సన్ శ్రీనాథ్, వెంకటరమణ, వెంకటేశం, లోకేశ్వర్, విజయ్ కుమార్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## మున్నూరుకాపు కమిటీ ఎన్నిక

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 4 : బీర్కూర్ మండల నూతన మున్నూరు కాపు కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా విఠల్, గౌరవ అధ్యక్షుడిగా తోట నారాయణ, ఉపాధ్యక్షులుగా పుల్లేని బాబురావు, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, కార్యదర్శులుగా సత్యం, రాంబాబు, కోశాధికారిగా అంబయ్య, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 4 : బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్‌లో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ లత ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాములు, మాజీ ఎంపీపీ రఘు, నాయకులు, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు బియ్యం పంపిణీ



అంకోల్ క్యాంపు గ్రామంలో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 4 : నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంపు గ్రామం, బీర్కూర్ మండలంలోని రైతు నగర్ గ్రామంలోని రేషన్ షాపు వద్ద ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్లు లత, ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్యామల, మాజీ ఎంపీపీలు, విఠల్, రఘు, మాజీ ఏఎంసీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, నాయకులు మాజిద్, రాము, మల్లేశ్, శశికిరణ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

కామారెడ్డి, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదేశాల మేరకు పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై మోసాలకు ప్రజలు గురికావొద్దని చెప్పారు. బెట్టింగ్‌లు పెట్టి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు నరేశ్, గంగాప్రసాద్, బీఆర్ఎస్ నాయకుడు గెరిగంటి లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి!

కామారెడ్డి రూరల్ , ఏప్రిల్ 4 : కామారెడ్డి పట్టణంలోని చెరువులో పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. చనిపోయిన వ్యక్తికి తెల్ల గడ్డం ఉన్నదని, వయస్సు 50 ఏండ్లు ఉంటుందని పేర్కొన్నారు. అతడి ప్యాంటు, షర్టు చెరువు గట్టుపై లభించాయని, అతడి ఫోన్ నంబర్ ఉన్నదని, చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు

## శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 : ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ – డిచ్‌పల్లి ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల ఉచిత శిక్షణ కోసం మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలర్ కోర్సు ఈనెల 7 నుంచి, బ్యూటీషియన్ కోర్సు ఈనెల 14 నుంచి ప్రారంభమవుతుందని, శిక్షణ సమయంలో ఉచితంగా హాస్టల్ వసతి, భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. 19-45 సంవత్సరాల వయస్సు ఉండి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువతులు అర్హులని తెలిపారు. అర్హులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, ఐదు ఫొటోలతో సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08461-295428 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## వాహనాల తనిఖీ

రామారెడ్డి (సదాశివనగర్), ఏప్రిల్ 4: ఎస్పీ రాజేశ్‌చంద్ర ఆదేశాల మేరకు సదాశివనగర్ మండలం పద్మాజివాడి ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై రంజిత్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. బైక్ నడిపే వారు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పకుండా ధరించాలని సూచించారు. ఆయనవెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## కొలతలు సక్రమంగా సేకరించాలి



నాగన్నబావిలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట, ఏప్రిల్ 4: ఉపాధి హామీ పథకంలో కూలీలు చేపట్టిన పనులకు సంబంధించి కొలతలు సక్రమంగా సేకరించాలని ఎంపీడీవో నరేశ్ సంబంధిత సిబ్బందికి సూచించారు. పోతాయిపల్లి గ్రామంలో కూలీలు చేసిన పనుల కొలతల సేకరణను ఆయన శుక్రవారం పరిశీలించారు. పనులకు హాజరైన కూలీల వివరాలు మస్టర్లలో నమోదు చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని నాగన్న బావిలో చేపడుతున్న పూడికతీత పనులు పరిశీలించారు.

## కొనసాగుతున్న 'డబుల్' లబ్ధిదారుల సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 4: పట్టణంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారుల సర్వే కొనసాగుతున్నది. ప్రత్యేక బృందాలు పట్టణంలో వార్డుల వారీగా తిరుగుతూ దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. గతంలో 259 డబుల్ బెడ్ రూం ఇండ్లను పంపిణీ చేయగా.. మిగిలిన 41 ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది సర్వే చేపడుతున్నారు.

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ

నిజాంసాగర్/ లింగంపేట, ఏప్రిల్ 4: ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులకు ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్న సాయిలు, సునీల్, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. లింగంపేటలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు వైద్యుడు సాయికిరణ్‌గౌడ్ ఫిజియోథెరపీ నిర్వహించారు. శారీరక వైకల్యం ఉన్న విద్యార్థులకు క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయిస్తే బాగుపడుతారని తెలిపారు. చిన్నారులకు క్యాలిపర్స్, రవాణా చార్జీలు అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 4: మండలంలోని మేలకుంట తండాలో మూడ్ లక్ష్మణ్‌కు చెందిన ఆవు గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందింది. గ్రామ శివారులో మేపేందుకు శుక్రవారం పశువులను తీసుకెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ వైరు తగలడంతో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు. పశువైద్యాధికారి రవికుమార్ పోస్టుమార్టం నిర్వహించారు. ఆవు మృతితో తనకు రూ.50వేల నష్టం వాటిల్లిందని, అధికారులు పరిహారం అందించాలని బాధితుడు కోరారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

**డీఆర్డీవో సురేందర్**

లింగంపేట, ఏప్రిల్ 4: గురుకుల పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీవో సురేందర్ అన్నారు. లింగంపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గదిని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు వేసిన చిత్రాలను పరిశీలించి, వారిని అభినందించారు. ప్లాస్టిక్ రహిత పాఠశాలగా తీర్చిదిద్దుతామని విద్యార్థులు ఆయనతో తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించి, స్టోర్ రూంలో ఉన్న బియ్యం, కూరగాయలు తనిఖీ చేశారు. డీఆర్డీవో వెంట ఎంపీడీవో నరేశ్, ఏపీఎం చామంతి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి మల్హరీ, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరాములు, పాఠశాల ఎస్‌వో వాసంతి తదితరులు ఉన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న డీఆర్డీవో సురేందర్

**ఇందిరమ్మ గృహాల కోసం అర్హులను గుర్తించాలి..**

మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల మంజూరు కోసం అర్హులను గుర్తించాలని డీఆర్డీవో సురేందర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా వారి ఇండ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంతోపాటు వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిష్ పాండ్ల నిర్మాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫిష్ పాండ్ల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. పైలట్ గ్రామం ఎల్లారంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులు త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హరీ, ఏపీవో నరేందర్, ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## మంజీర పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



మంజీరాలో ఇసుక మేటలు పరిశీలిస్తున్న అధికారులు

బిచ్కుంద, ఏప్రిల్ 4: మండలంలోని హస్గుల్, శెట్లూర్, ఖత్‌గావ్, పుల్కల్ గ్రామ శివారుల్లో ఉన్న మంజీర పరీవాహక ప్రాంతాల్లోని ఇసుక క్వారీలను మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. నియోజకవర్గానికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇసుక తరలించేందుకు మంజీరా నదిలోని నీటి నిల్వలు, ఇసుక మేటలను పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ నగేశ్, ఇరిగేషన్ ఏఈ చందు, రెవెన్యు అధికారులు పాల్గొన్నారు.

## దవాఖాన నిర్మాణానికి స్థల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

బిచ్కుంద, ఏప్రిల్ 4: బిచ్కుందలో నిర్మించనున్న వంద పడకల దవాఖాన కోసం డీసీహెచ్ఎస్ డాక్టర్ విజయలక్ష్మి అధికారులతో కలిసి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ముందుగా దవాఖానలో రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. దవాఖాన ఆవరణ అంతా తిరిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కుమార్, అధికారులు సాగర్, భాస్కర్, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కాళీదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ లక్ష్యం త్వరగా పూర్తిచేయాలి



ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చందర్‌నాయక్

రామారెడ్డి(గాంధారి), ఏప్రిల్ 4: ఎల్ఆర్ఎస్ లక్ష్యం త్వరగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు ఇన్‌చార్జి కలెక్టర్ చందర్‌నాయక్ అధికారులకు సూచించారు. గాంధారి మండలంలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఎల్ఆర్ఎస్ సెంటర్‌ను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాజీవ్ యువశక్తి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రత్యేక హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని ఎంపీడీవో రాజేశ్వర్‌ను ఆదేశించారు. అనంతరం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయనవెంట ఎంపీవో లక్ష్మీనారాయణ, ఆర్ఐ ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## బ్రాహ్మణపల్లి సందర్శన

నిజాంసాగర్, ఏప్రిల్ 4: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామాన్ని మండల ప్రత్యేకాధికారి ప్రమీల శుక్రవారం సందర్శించారు. కూలీలు చేపడుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, రిజిస్టర్లు తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీఎం శివకుమార్, పంచాయతీ కార్యదర్శి తుకారాం, టెక్నికల్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'ధరణి' సమస్యలు వెంటనే పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బిచ్కుంద, ఏప్రిల్ 4: ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. బిచ్కుంద తహసీల్ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ధరణి పెండింగ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భూ విస్తీర్ణం, పేరు సవరణ కోసం వచ్చిన దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలన్నారు. ఆదాయ, ఇతర ధ్రువ పత్రాల కోసం మీ సేవ నుంచి వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, నాయబ్ తహసీల్దార్ భరత్, కంప్యూటర్ ఆపరేటర్ రాజశేఖర్, సాయాగౌడ్, కుషాల్, సుమలత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 4: మేజర్‌వాడి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఏడో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి హెచ్ఎం రాజు, ఉపాధ్యాయినులు శ్రీలత, మానస బహుమతులు అందజేశారు.

## ఉపాధ్యాయులు నైపుణ్యాలతో పాఠాలు బోధించాలి



మాట్లాడుతున్న ఎంఈవో రామస్వామి

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 4: ఉపాధ్యాయులు నైపుణ్యాలతో విద్యార్థులకు పాఠాలు బోధించాలని తాడ్వాయి ఎంఈవో రామస్వామి సూచించారు. ప్రమోషన్ పొందిన హిందీ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని కృష్ణాజివాడి జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం నిర్వహించారు. ఎంఈవో పాల్గొని మాట్లాడారు. శిక్షణ నైపుణ్యాలు అభ్యాసన అభివృద్ధికి తోడ్పడుతాయని స్పష్టం చేశారు. హిందీ భాషలో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ శిక్షణలో తాడ్వాయి, లింగంపేట, రాజంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన 80మంది హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హిందీ దేశభక్తి నినాదాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆర్పీలు రఫియా సుల్తానా, మహ్మద్ షకీల్, గఫూర్ శిక్షక్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలకు రోజుకు రెండు సార్లు నీళ్లు పట్టాలి



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 4: మొక్కలకు ప్రతిరోజూ రెండుసార్లు నీళ్లు పట్టాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. మండలంలోని మల్కాపూర్ గ్రామ పల్లె ప్రకృతి వనాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కలకు నీళ్లు పట్టారు. అనంతరం ఆయన గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టి, త్వరగా అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రకాశ్, జూనియర్ అసిస్టెంట్ సంగమేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ తదితరులు ఉన్నారు.

## పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 4: ఎంఈవోగా బాధ్యతలను చేపట్టిన రాజును ఎమ్మార్సీ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయనకు పూలమాల వేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాలల్లో సమస్యలు లేకుండా, చూస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది మండ్రు అశోక్, కాశీరాం, సీఆర్పీలు మహేశ్, దత్తాద్రి, మహిపాల్, విజయలక్ష్మి, మెసెంజర్ లక్ష్మణ్, ఐఈఆర్పీ వెంకటేశం, రామారెడ్డి ఎంఈవో ఆనందరావు, ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్(బాలికల)ఉపాధ్యాయులు లింగమూర్తి, దేవీదాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.